క్లుప్తంగా

డీఎం నిర్లక్ష్య వైఖరి వీడాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ డీఎం ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల పనిభారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ధర్మవరం ఆర్టీసీ డిపోలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబి నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫా మాట్లాడుతూ 70, 71 సర్క్యులర్ పేరిట ఉద్యోగులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఇకనైనా యాజమాన్యం కళ్లు తెరిచి పెంచిన పనిభారాలు వెంటనే తగ్గించాలన్నారు. యూనియన్ ఏడీసీలు మల్లికార్జున, టీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీ తేలేవరకు పనులు ఆపండి

- పనులు చేస్తే హిటాచి అద్దాలు పగులుతాయి
- రైతులను బెదిరిస్తున్న కూటమి నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'మాకు మాకు ఎన్నో ఉన్నాయి. వాటికి సంబంధించిన పంచాయితీ తేలే వరకు పనులు చేయొద్దు. కాదు కూడదని పనులు చేస్తే హిటాచీ అద్దాలు పగులుతాయి' అంటూ కూటమి నాయకులు రైతులను బెదిరింపులకు గురిచేస్తున్న సంఘటన ధర్మవరం మండలం దర్శనమలలో చోటు చేసుకుంది. వివరాలు.. దర్శనమల గ్రామానికి చెందిన రైతులు మారుతి, ఈశ్వర్‌రెడ్డి వారికున్న 4 ఎకరాల పొలాన్ని ఇటీవల ఓబిరెడ్డి అనే రైతుకు విక్రయించాడు. పొలంలో రాళ్లు ఎక్కువగా ఉండడంతో వాటిని చదును చేయడానికి హిటాచి కోసం ఆరా తీశారు. వీరి గ్రామానికి సమీపంలో ఉన్న ఓబుళనాయనపల్లికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి మిత్రుల వద్ద హిటాచి ఉందని తెలియడంతో రైతులు అతడిని కలిశారు. పొలంలో రాళ్లు తొలగించడానికి గంటల ప్రకారం తానే దగ్గరుండి పనులు చేయిస్తానని చెప్పడంతో రైతులు ఒప్పందం చేసుకున్నారు. పొలంలోకి హిటాచి వెళ్లడానికి రహదారిలో నీళ్లుండడంతో కొద్దిగా మట్టిని తొలగించారు. మట్టిని తొలగించిన ప్రాంతంలో దర్శనమల గ్రామానికి చెందిన కూటమి నేత ధనుంజయ పొలానికి వెళ్లడానికి దారి ఉంది. దారి లేకుండా మట్టిని తొలగించావంటూ అక్కడే ఉన్న గంగాధర్‌తో ధనుంజయ గొడవకు దిగాడు. దీంతో వీరి మధ్యన స్వల్ప వివాదం నెలకొంది. పనులు ముగిసిన తర్వాత హిటాచితో మట్టిని చదును చేసి రహదారిని బాగు చేయిస్తామని రైతులు చెప్పినా కూటమి నేత తన అనుచరులతో రైతులను బెదిరించాడు. కాదు కూడదని పనులు చేస్తే యంత్రం అద్దాలు పగులగొడతామని హెచ్చరికలు జారీ చేయడంతో భయాందోళనకు గురైన రైతులు మూడు రోజులుగా పనులు నిలిపి వేసి యంత్రాన్ని పొలంలోనే ఉంచుకున్నారు.



పనులను అడ్డుకోవడంతో పొలంలోనే వుంచిన హిటాచి యంత్రం



వివాదానికి కారణమైన గుంత

పాత కక్షలతోనే పనులకు అడ్డంకులు

గతంలో కూటమి నాయకులకు, గంగాధర్‌కు మధ్య పాత కక్షలున్నాయని గొడవలు వుంటే వారు వారు చూసుకోవాలి కాని తమ పొలంలో పనులు నిలిపి వేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, వ్యాపార అవసరాల కోసం పొలం విక్రయించామని బాధిత రైతులు అంటున్నారు. ఇలాంటి సమయంలో పనులు చేయకుండా కూటమి నాయకులు అడ్డుకోవడం ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకున్నా కొందరు నాయకులు కావాలనే గొడవలకు అజ్యం పోస్తున్నట్లుగా తెలుస్తోంది. సున్నితమైన విషయాన్ని పోలీసులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

దసరా శుభాకాంక్షలు



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి నియోజవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శక్తులపై దైవ శక్తులు విజయం సాధించిన రోజున దసరా పండుగ జరుపుకుంటామన్నారు. జగన్మాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ శాంతులు, సిరిసంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దసరా శుభాకాంక్షలను తెలిపారు. పండుగను నియోజకవర్గంలోని ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



ధర్మవరం అర్బన్: ధనలక్ష్మీదేవిగా టీచర్స్‌కాలనీ సజ్జలకాల్వ అమ్మవారు

జయజయహే మహిషాసురమర్దిని

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

– సాక్షినెట్‌వర్క్:



ధర్మవరంలో కృష్ణునిగా లక్ష్మీచెన్నకేశవస్వామి



కదిరిలో మహిషాసుర మర్ధనిగా మహాలక్ష్మి



బత్తలపల్లి: మహిషాసురమర్ధిని రూపంలో అమ్మవారి విగ్రహం



కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో రాజరాజేశ్వరిగా మల్లాలమ్మ



బుక్కపట్నంలో రథంపై ఊరేగుతున్న చిన్నాగమ్మ దేవత



కనగానపల్లి: మామిళ్లపల్లిలో పూజలందుకున్న దుర్గామాత

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల వ్యాప్తంగా ఉన్న 10 గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా చౌడేశ్వరీ ఆలయంలో జరుగుతున్న నవ చండీహోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులను తీసుకున్నారు. అనంతరం ఏ కొత్తపల్లిలో ఇటీవలే మృతి చెందిన గంగులప్ప కుటుంబీకులను పరామర్శించారు. తర్వాత కంచరవాండ్లపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ తర్వాత పూలకుంటపల్లికి వెళ్లి వారం క్రితం మృతి చెందిన మాజీ ఎంపీటీసీ భర్త జగదీశ్వర్‌రెడ్డి కుటుంబీకులతో మాట్లాడారు. అనంతరం లోకోజుపల్లికి వెళ్లి ఇటీవలే మృతి చెందిన వెంకటరెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే కుమ్మరిండ్లుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వెంకటరమణతో మాట్లాడారు. ఈ తర్వాత మహమ్మదాబాద్, గొల్లపల్లిలో ఇటీవలే మరణించిన పొగాకుబాషా, రామకృష్ణమ్మ, జయమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడొద్దని అందరికీ నేను తోడుగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవితా శివశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఏ కొత్తపల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన తంగేడుకుంట సర్పంచ్ అబిదాభానురఫీ ఓడీచెరువులో నూతనంగా నిర్మించిన గృహాన్ని సందర్శించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షామీర్ బాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, లక్ష్మిరెడ్డి, సర్పంచులు గోవింద్, జగన్‌మోహన్‌చౌదరి, హనుమంతరెడ్డి, ఆనంద్‌రెడ్డి, జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించారు. నల్లమాడకు చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత మోదీనమ్మ భర్త హైదర్‌వలీ(70, ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉగ్ర నరసింహులు(58) అనారోగ్యంతో, చౌటకుంటపల్లికి చెందిన చాకలి పెద్దన్న కుమారుడు సురేష్‌బాబు(35) గుండెపోటుతో కొద్ది రోజుల క్రితం మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వేళ్లమద్దిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత సీతారాం భార్య చంద్రమ్మ, రెడ్డిపల్లిలో సర్పంచ్ ప్రసాద్ కుమారుడు సుకుమార్‌ను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మాజీ సమితి అధ్యక్షుడు రామానాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, చిన్నాదేవి, సర్పంచ్ ఆనంద్‌నాయక్, ఎంపీటీసీ శివారెడ్డి, పట్టణ కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, శంకర్‌నాయక్, రమణానాయక్ ఉన్నారు.

కంపచెట్ల తొలగింపు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి

పుట్టపర్తి: బుక్కపట్నం నుంచి గోరంట్లపల్లికి పోయే రహదారికి ఇరువైపులా కంప చెట్లు, మట్టి దిబ్బలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సమస్యను గుర్తించిన సర్పంచ్ నాగలక్ష్మి శుక్రవారం పంచాయతీ సిబ్బందితో కలిసి కంపచెట్లు, మట్టిదిబ్బలను తొలగింపజేశారు. ఈసందర్భంగా గోరంట్లపల్లి గ్రామస్తులు సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా నవ చండీహోమం





మహిషాసురమర్దిని అవతారంలో చౌడేశ్వరమ్మ , చండీహోమంలో పూజలు చేస్తున్న దుద్దుకుంట

అమడగూరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరి ఆలయంలో ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నవరాత్రుల్లో భాగంగా నవ చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. మండల ప్రజలు, రైతులు సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. బెంగుళూరు ఉత్తరహళ్లికి చెందిన ఎమ్మెల్యే కిష్టప్ప హాజరయ్యారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులను ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన కొల్లాపురమ్మ దేవి ఆలయంలో శుక్రవారం మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయ ఆవరణలో గణపతి హోమం, నవగ్రహారాధన, అమ్మవారి మంత్ర జపాలు, అమ్మవారి సింహ వాహన ప్రతిష్ఠ, దుర్గాహోమం, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, శ్రీలలితా సహస్రనామాలు, అమ్మవారికి కుంకుమార్చన చేపట్టారు. ఈ సందర్భంగా కొల్లాపురమ్మ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండల పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ఫల, పుష్పాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



అలంకరణలో కొల్లాపురమ్మ దేవత

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

బత్తలపల్లి: పరిసరాల పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికుల చేస్తున్న సేవలు ఎనలేనివని బత్తలపల్లి ఉప సర్పంచు కోటి అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో బత్తలపల్లిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, ఆయిల్ బాటిళ్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ ఉన్నారు.



కార్మికులకు దుస్తులు అందిస్తున్న ఉప సర్పంచు గోపీనాథ్

వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్: కదిరి– హిందూపురం రహదారిపై గట్ల వద్ద శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ముత్యాలచెరువు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితున్ని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బత్తలపల్లి: జ్వాలాపురం గ్రామంలో పశుగ్రాసం తీసుకెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్‌లైన్‌కు తాకిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు..గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన అన్నదమ్ములు రమేష్, సురేష్ తమ పొలంలోని వేరుశనగ కట్టె(పశుగ్రాసం) ట్రాక్టర్‌లో వేసుకుని ఇంటికి బయలుదేరారు. పొలాలకు వెళ్లే దారిలో తక్కువ ఎత్తులో మెయిన్ లైను వైర్లు ట్రాక్టర్‌కు తగలడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమై వెంటనే పశుగ్రాసాన్ని కింద పడేశారు. ట్రాక్టర్ ఇంజిన్‌కున్న నాలుగు చక్రాలు, బ్యాటరీ కాలిపోయాయి. ఘటనలో రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



కాలిపోయిన ట్రాక్టర్ టైరు

ఘనంగా ఆయుధ పూజ

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ట్రాన్స్‌కో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌తోపాటు రైతులు, వివిధ వృత్తుల వారు పనిముట్లకు ఆయుధ పూజ చేశారు.

నేటి నుంచి చిన్న కుళ్లాయిస్వామి ఉరుసు

ఎన్పీకుంట: వెలిచలమల గ్రామంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు చిన్న కుళ్లాయిస్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు స్వామి వారి గంధం మెరవణి, రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివారం తెల్లవారుజామున స్వామివారి అగ్నిగుండం ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులకు అదే గ్రామానికి చెందిన బోరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మద్యం షాపులకు 219 దరఖాస్తులు

ధర్మవరం: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 20 మద్యం దుకాణాలకు 219 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వతేదీ సాయంత్రం 5 గంటల వరకు టెండర్లు వేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇదిలా ఉండగా రెండురోజుల నుంచి టీడీపీ నాయకులు ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఉంటూ టెండర్లు వేసేందుకు వచ్చే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

14 నుంచి 'పల్లె పండుగ'

బత్తలపల్లి: మండలంలో ఈనెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు శుక్రవారం తెలిపారు. ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు కింద గ్రామసభల్లో ఆమోదం పొందిన పనులను ప్రారంభిస్తామన్నారు. తొలిరోజు నల్లబోయనపల్లి బీసీ కాలనీ, డి.చెర్లోపల్లి బీసీ కాలనీలో సీసీరోడ్లకు భూమి పూజ చేస్తామన్నారు. 15న గరిశలపల్లి, 16న మధ్యాహ్నం మాల్యవంతం, 17న దంపెట్ల, పోట్లమర్రి, 18న ఓబుళాపురం, తంబాపురం సీసీ రోడ్లు పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే, 19న సంగాల, అప్పరాచెరువు, 20న ఈదుల ముష్టూరు, సంజీవపురం, బత్తలపల్లిలో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు భూమి పూజలు చేస్తున్నట్లు వివరించారు.

తాడిమర్రి: మండలంలో ఈనెల 14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట రంగారావు శుక్రవారం తెలిపారు. తొలిరోజు నిడిగల్లు, నార్సింపల్లి, 15న ఏకపాదంపల్లి, 16న పిన్నదరి, కునుకుంట్ల, రామాపురం, 17న చిల్లవారిపల్లి, దాడితోట, 18న చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, 19న ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు, 20 తాడిమర్రి, ఆత్మకూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ఓడీచెరువు: పోలేవాండ్లకొత్తపల్లికి చెందిన వైఎస్రార్‌సీపీ కార్యకర్త వెంకటరాముడి భార్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, జయపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

స్థల పరిశీలన

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో పార్క్ ఏర్పాటుకు శుక్రవారం ఎంపీడీఓ పోలప్ప స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ పార్కు ఏర్పాటు చేస్తే ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు, పెద్దలు సేదతీర వచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి శివశంకర్ ఉన్నారు.